## క్లుప్తంగా

### ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా జ్ఞానోబా పుష్కర్

**నార్నూర్:** ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జ్ఞానోబా పుష్కర్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీజేపీ అధిష్టానం నమ్మకంతో అప్పగించిన ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్ష పదవికి న్యాయం చేయడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లోని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేషరావు రాథోడ్, భిక్షపతి రాథోడ్, తొడసం బండు, చాలూర్కర్ ప్రకాష్ పాల్గొన్నారు.

### మానవత్వం చాటిన సికిందర్ రాథోడ్

**నార్నూర్:** గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని చేరదీసి మానవత్వం చాటుకున్నాడు మండల కేంద్రానికి చెందిన పెసా చట్టం కో ఆర్డినేటర్ సికిందర్ రాథోడ్. గురువారం మండల కేంద్రంలో మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి అతడికి కటింగ్, గడ్డం తీసి స్నానం చేయించారు. కొత్త బట్టలు అందజేశారు. అనంతరం కడుపు నిండా భోజనం పెట్టి తన ఉదారత చాటుకున్నాడు. ఆయన వెంట గోశాల నిర్వాహకుడు రామ్‌నివాస్ అడే, తదితరులు ఉన్నారు.

### సన్మానం

**నార్నూర్:** ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గురువారం రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చౌహాన్ వందన ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమైనప్పటికీ జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లడం బాధగా ఉందన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు చౌహాన్ నెహ్రూ, ఆడే విశ్వనాథ్, రాథోడ్ సుస్మిత, ఆడే కైలాష్, పుష్పలత, చంపావతి లను సత్కరించారు.

### ప్రిన్సిపాళ్ల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

**ఆదిలాబాద్‌టౌన్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల నూతన కార్యవర్గాన్ని గురువారం ఆదిలాబాద్ పట్టణంలో ఎన్నుకున్నారు. అనంతరం డీఐఈవో రవీందర్ కుమార్‌ను కలిశారు. అధ్యక్షుడిగా జాదవ్ గణేష్ కుమార్, కార్యదర్శిగా విఠల్, ఉపాధ్యక్షుడిగా శంకర్, సంయుక్త కార్యదర్శిగా సూర్యప్రకాష్, కోశాధికారిగా సునీల్, కార్యవర్గ సభ్యులుగా భగవాండ్లులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా మోసిన్ వ్యవహరించారు.

### ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**ఇచ్చోడ:** తెలుగు భాష కన్న తల్లిలాంటిందని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సరస్వతి అన్నారు. గురువారం డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు నర్సయ్య, గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. తెలుగు భాషను ప్రతిఒక్కరూ కాపాడుకోవాలన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధు, దయాకర్, మురళీ, ప్రభాత్‌రావు, సరితారాణి, తిరుపతి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### కళాశాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

**ఉట్నూర్‌రూరల్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేతో సమావేశమై కళాశాలలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ప్లేగ్రౌండ్, ప్రహరీ, స్పోర్ట్స్ కిట్స్, కంప్యూటర్‌లను కళాశాలకు మంజూరు చేయాలని కోరారు. పంచాయతీ రాజ్ డీఈతో ఫోన్‌లో మాట్లాడి ప్లేగ్రౌండ్, ప్రహరీకి సంబంధించిన ఖర్చు నివేదికను అందించాలన్నారు.

**ఉట్నూర్‌రూరల్:** ఆదివాసీల సంక్షేమ సంఘం మూడో వార్షికోత్సవంలో భాగంగా ఆదివాసీ కళా ప్రతిభ పురస్కారాల పోస్టర్‌ను మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం ఆవిష్కరించారు. ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్, ఆడ భీంరావు, సోయం నరేశ్, ఆనంద్, శేఖర్ పాల్గొన్నారు.

# పంటల రక్షణకు సోలార్ కంచె

- వన్యప్రాణుల నుంచి కాపాడుకునేందుకు రైతులు ఆసక్తి
- అడవిపందులతో నష్టపోతున్న రైతులు



తలమడుగులో పొలం చుట్టూ ఏర్పాటు చేసుకున్న సోలార్ కంచె

**తలమడుగు:** పగలు, రాత్రి అనే తేడా లేకుండా కష్టపడి పంటలు పండించే రైతులకు కష్టాలు తప్పడం లేదు. విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకు పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పరిస్థితి. ఆదమరిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. దీంతో రైతుల ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. ప్రాణహాని లేని ఆధునిక విధానం వైపు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగానే సోలార్ కంచె ఏర్పాటు చేసుకొని పంటలను రక్షించుకుంటున్నారు. వన్యప్రాణుల నుంచి పంటలను రక్షించేందుకు సోలార్ కంచె ఉత్తమం అని భావించి ఏర్పాటు చేసుకుంటున్నారు.

**ఇది పరిస్థితి..**

తలమడుగు మండలంలోని తలమడుగు, కొత్తూరు, ఝరీ, ఉమ్రి, కప్పర్‌దేవి, లచ్చంపూర్, కుచులాపూర్, పల్సి, పల్సి(బి(తండా, రత్నాపూర్, లింగి, బరంపూర్, పల్లి, పల్లి(కె), దేవాపూర్, గ్రామాల చుట్టూ ఎక్కువగా అటవీ ప్రాంతాలు ఉన్నాయి. అటవీ జంతువులు, వన్యప్రాణులు పంట పొలాలకు వచ్చి నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి జొన్న, సోయాబీన్, కంది పంటలను కాపాడుకునేందుకు సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. పది ఎకరాలకు సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవాలంటే రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.

**రాయితీపై అందించాలి..**

ప్రభుత్వం డ్రిప్ పరికరాలపై ఇచ్చినట్లు సోలార్ కంచెలకు కూడా రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఎకరానికి ప్రభుత్వం గతంలో 50 శాతం రాయితీ ఇచ్చేది. అది కూడా నాలుగు సంవత్సరాల నుంచి నిలిపివేయడంతో రైతులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి 80 శాతం నుంచి 90 శాతం వరకు రాయతీ ఇవ్వాలని కోరుతున్నారు.

### సబ్సిడీ పెంచాలి



పంట పొలం చుట్టూ అటవీ ప్రాంతం ఉంది. వణ్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకునేందుకు గతంలో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇచ్చేది. ఇప్పుడు అది కూడా నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం రైతులపై ఆర్థిక భారం పడుతుంది. సబ్సిడీని ప్రభుత్వం పెంచాలి. – బాగిడి భూమయ్య, రైతు

### జంతువుల బెడద తప్పింది



పొలం చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకున్నాను. దీంతో పశువుల, వన్యప్రాణుల బెడద తప్పింది. సాధారణంగా ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు చేసుకుంటే లక్ష వరకు ఖర్చు అవుతోంది. సోలార్ కంచెకు రూ. 15,000 వేలు ఖర్చు అవుతుంది.

– కరుణాకర్‌రెడ్డి, రైతు

### సోలార్ కంచె మేలు



సోలార్ పెన్సింగ్ ఏర్పాటుతో తక్కువ ఖర్చుతో పంటలను రక్షించుకోవచ్చు. ఇప్పటికే మండలంలో కొంతమంది రైతులు ఏర్పాటు చేసుకున్నారు. మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ కంచెతో ఇటు పంట పొలాలతో పాటు వన్యప్రాణులకు ఎలాంటి హాని ఉండదు. రైతులు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది.

– ప్రమోద్, ఏవో

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

**ఆదిలాబాద్:** కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకమైన జిల్లా కేంద్రానికి చెందిన తోకల నరేశ్‌కు గురువారం జిల్లా కేంద్రంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులందరినీ సమన్వయం చేసుకొని విజయానికి పాటుపడాలన్నారు. తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

**రహదారి విస్తరణకు కృషి**

**ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలో నిలిచిపోయిన పాత జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. తిర్పెల్లి వద్ద నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులను ఆర్అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రహదారి వెంట నడుస్తూ పనుల ప్రారంభానికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య, ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పాల్గొన్నారు.

**నృత్య కళాకారుడికి సన్మానం**

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను జిల్లా కేంద్రానికి చెందిన నృత్య కళాకారుడు, బాల కేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కళారత్న పురస్కారం అందుకున్న ఆయనను పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**ఇంద్రవెల్లి:** ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని బొడ్డిగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు, గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పవార్ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

**నేరడిగొండ:** పరిసరాల, వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ సాగర్ అన్నారు. ఫీవర్ సర్వేలో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బుగ్గారం గ్రామంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలికల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. ప్రిన్సిపాల్ స్వప్న, ఫార్మాసిస్ట్ ఓంప్రకాష్, ఏఎన్‌ఎంలు సుజాత, జ్యోతి, ల్యాబ్ టెక్నిషియన్ రవీందర్ పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్ కుమార్

**తాంసి:** విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాలతో పాటు ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న పనులను పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని సైతం పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. వసతులపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్‌తో కలిసి మధ్యాహ్న భోజనం రుచిచూశారు. ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, పాఠశాల హెచ్ఎం ఆనంద్, ఉపాధ్యాయులు కిష్టన్న, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానానికి చేయూత



మౌనిష్ రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**ఆదిలాబాద్‌రూరల్:** శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని గురువారం మావల మండలం కేఆర్కే కాలనీలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కాలనీవాసులు నగర భోజనాన్ని నిర్వహించారు. మావల మండలంలోని టీచర్స్ కాలనీకి చెందిన సామాజిక వేత్త ముడుపు మౌనిష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమానికి తన వంతుగా చేయూత అందజేసి అండగా నిలిచారు. దీంతో కాలనీవాసులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కేఆర్కే కాలనీవాసులు కుర్ర నరేశ్, సురేశ్, సుభాష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రహీంపాషా

**నార్నూర్:** వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ రహీంపాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు పార్కింగ్ సమస్య ఉందన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తప్పనిసరిగా లైసెన్సు, వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ దాదేఅలీ, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫెరోజ్ ఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడాకారులతో లెక్చరర్లు



పీడీలను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

**నేరడిగొండ:** మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో గురువారం ప్రపంచ క్రీడా దినోత్సవంతో పాటు తెలుగు మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో క్రీడాకారులను ఉపాధ్యాయులు, లెక్చరర్లు సన్మానించారు. మున్ముందు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి రజిత, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి**

**బోథ్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏబీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. ప్రతీరోజు కొంత సమయాన్ని ఆటలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సొసైటీ సభ్యులు తుల అజయ్ కుమార్, ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ లోలపు పోశెట్టి, చెట్లపెల్లి సుధీర్ పాల్గొన్నారు.

**ఉట్నూర్‌రూరల్:** ట్నూర్ కేబీ ప్రాంగణంలోని డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో క్రీడా, తెలుగు భాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు హాకీ క్రీడాకారులు గోల్డ్ మెడలిస్ట్ ధ్యాన్ చంద్, తెలుగుభాష ఉద్యమానికి ఆద్యుడు వ్యవహార భాపితామహుడు గిడుగు రాంమూర్తి చిత్రపటాలకు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, పీడీ అనిత్, అధ్యాపకులు శ్వేత, యోగలక్ష్మి, నర్సింగ్ రావు, రాజశేఖర్, రాణి పాల్గొన్నారు.

**నార్నూర్:** మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పీడీ రమేశ్ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్ పీడీలు ఆడే విశ్వనాథ్, ఉజ్వలలను సత్కరించారు. ప్రతీ విద్యార్థికి చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వం'

**కైలాస్‌నగర్:** కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వమని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ప్రజాసేవభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణంలోని భగత్ సింగ్‌నగర్, బంగారిగూడకు చెందిన పలువురు కాలనీవాసులు, యువకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రూ.2లక్షల రుణాలను రైతులకు మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్,లోక ప్రవీణ్ రెడ్డి, రాందాస్ నాక్లే, తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదు చేపట్టాలి



మాట్లాడుతున్న పతాంగే బ్రహ్మానంద్

**తాంసి:** ప్రతీ పోలింగ్ బూత్ నుంచి అధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్ అన్నారు. గురువారం భీంపూర్ మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, మండల అధ్యక్షుడు రాకేశ్ యాదవ్, నారాయణ, స్వామి, మల్లేష్, వెంకటేశ్, అశోక్ పాల్గొన్నారు.

**తలమడుగు:** సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో 200ల మందితో సభ్యత్వం చేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, నక్క ధనుంజయ్, కనపర్తి చంద్రకాంత్, కిరణ్, భుజంగ రావు, శ్రీనివాస్, రవి, నికోడ అశోక్, నారాయణరెడ్డి, నాగార్జున్ రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**బేల:** సభ్యత్వ నమోదును పెంచాలని బీజేపీ ఆదిలాబాద్ నియోజకవర్గం కన్వీనర్ బోయర్ విజయ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, రాకేశ్, ఠాక్రే సందీప్, ఇంద్రశేఖర్, రాము పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఐడీబీఐ బ్యాంక్ ప్రారంభం**

**ఉట్నూర్‌రూరల్:** ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో బ్యాంకు సేవలు అందుబాటులో తీసుకురావడం అభినందనీయమని ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ అన్నారు. గురువారం ఉట్నూర్ పట్టణ ప్రాంతంలోని ఐబీ సమీపంలో ఐడీబీఐ బ్యాంకును ప్రారంభించారు. బ్యాంకు సీజీఎం జోనల్ అధికారి శరత్ కమత్, బాసుదేవన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

**కవులు, రచయితలకు సన్మానం**

**బోథ్:** మండలంలోని సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తెలుగభాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు, రచయితలను పాఠశాలకు ఆహ్వానించి సత్కరించారు. రచయితలు మురళీధర్, గొల్లపెల్లి రమేశ్, రామగిరి ప్రకాష్, సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పుస్తకావిష్కరణ**

**ఆదిలాబాద్:** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జిల్లా కేంద్రానికి చెందిన అధ్యాపకుడు పురుషోత్తం రెడ్డి రచించిన తెలంగాణ నిర్మితి పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాం ఆవిష్కరించారు. ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్, పుస్తక రచయిత పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

**కంటి వైద్య శిబిరం**

**నార్నూర్:** జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఆర్‌బీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 263 విద్యార్థినులకు కంటి పరీక్షలు చేసి, పలువురికి కళ్లద్దాలు అందజేశారు. వైద్యులు మనోజ్, రాజమణి, ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, పీడీ ఆడే విశ్వనాథ్ ఉజ్వల పాల్గొన్నారు.

**విజయవంతం చేయండి**

**ఇంద్రవెల్లి:** కుమురం భీం జిల్లా జైనూర్ మండలంలోని పట్నాపూర్ గ్రామంలోని పూలాజీబాబా ధ్యాన్ కేంద్రంలో ఈనెల 29, 30న నిర్వహించే పూలాజీబాబా జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆంధ్ ఆదివాసీ సమాజ్ జిల్లా,రాష్ట్ర నాయకులు కుడే కైలాస్, కరాడే మారుతి, డాకురే రాందాస్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని పూలాజీబాబా ధ్యాన్ కేంద్రం వద్ద బాబా జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు.

**ఘనంగా భీంరావు వర్ధంతి**

**ఉట్నూర్‌రూరల్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటి గిరిజన శాఖ మంత్రిగా పని చేసిన కోట్నాక్ భీంరావు 22వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ ఎన్టీఆర్ చౌక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, సర్‌మెడీలు, తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి**

**ఉట్నూర్‌రూరల్:** అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సంక్షేమాధికారి సబిత అన్నారు. గురువారం ఐటీడీఏ ప్రాంగణంలో అంగన్‌వాడీ టీచర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**వాలీబాల్ నెట్ అందజేత**

**బోథ్:** మండలంలోని సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని విద్యార్థులకు గ్రామానికి చెందిన యవశక్తి యూత్ సభ్యులు గురువారం వాలీబాల్ నెట్‌ను అందజేశారు. తుల హరీష్, గాజుల సుగుణాకర్, సందీప్, హరి కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రత్యేక వార్డుగా ప్రకటించండి**

**బోథ్:** మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీని ప్రత్యేక వార్డుగా ప్రకటించాలని కోరుతూ మాజీ వార్డు సభ్యుడు షేక్ షాకీర్‌తో పాటు పలువురు గురువారం ఎంపీడీవో జీవన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

**ఎస్సీ కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి**

**తలమడుగు:** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితబంధులో ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ రావు అన్నారు. గురువారం మండలంలోని డోర్లి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందిన లబ్ధిదారుల పథకాలను పరిశీలించారు.

**పాఠశాలల తనిఖీ**

**బోథ్:** మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను జిల్లా సెక్టోరియల్ అధికారి నారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీసీఎస్‌డీఆర్‌పీ శ్రీపాద్, ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, గంగయ్య, సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

**పరామర్శ**

**బోథ్:** మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ తండ్రి ఆకుల నడిపెన్న గురువారం మృతి చెందడంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

**ఎమ్మెల్సీ కవితను కలిసిన చారులత**

**ఉట్నూర్‌రూరల్:** ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్‌పై విడుదల అయిన ఎమ్మెల్సీ కవితను ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.

### కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

**ఆదిలాబాద్‌టౌన్:** జాతీయ లోక్ అదాలత్ ద్వారా అధిక కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని జిల్లా జడ్జి ప్రభాకర రావు అన్నారు. గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉండేలా చూడాలన్నారు. సెప్టెంబర్ 28న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, న్యాయవాదులు పాల్గొన్నారు.